క్లుప్తంగా

చెక్కులు పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

భూసేకరణ పరిశీలన



భూసేకరణ పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో బుధవారం బైపాస్ రోడ్డు భూసేకరణను ట్రైనీ కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టోపో పరిశీలించారు. కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి విస్తరణ కోసం భూసేకరణ చేస్తున్నారు. డీఐ రవీంద్రాచారి, సర్వేయర్ సంతోష్ ద్వారా భూసేకరణ వివరాలను తెలుసుకున్నారు. వెంట ఆర్డీవో హరిసింగ్, తదితరులు ఉన్నారు.

నీరు వృథా చేయొద్దు

చొప్పదండి: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో బుధవారం క్యాచ్ ది రెయిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ అప్పిడి సౌజన్య, ఎంపీటీసీ బత్తుల లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ... ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని, వర్షం నీటిని ఇంకుడుగుంతలకు తరలించి భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో రాజు, అనుకారి సాయికృష్ణ, శ్రవణ్, సంపత్, మధు, కనుకరాజు, విజయ, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

గోదాములను అందుబాటులోకి తీసుకొస్తాం

చొప్పదండి: సంఘం ద్వారా నిర్మించిన గోదాములను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని చొప్పదండి పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి తెలిపారు. సంఘం కార్యాలయంలో బుధవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. నెలాఖరులోగా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని, అదే సమయంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో గోదాములను ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ముద్దం మహేశ్, సీఈవో కళ్యాం తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు కొస్న తిరుపతిరెడ్డి, కళ్యాం లక్ష్మారెడ్డి, నాంపెల్లి మల్లయ్య, మంగళారం మల్లారెడ్డి, సత్తు నర్సయ్య, గుర్రం సునంద, దుర్గం పద్మ, బందారి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌లు అందజేత



ప్యాడ్‌లు అందజేస్తున్న సర్పంచ్ మానస

రామడుగు: మండలంలోని గుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బుధవారం రామడుగు సింగిల్ విండో చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అందజేసిన పరీక్ష సామగ్రిని సర్పంచ్ గుండి మానస పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేడి శ్రీనివాస్, కార్యదర్శి జ్యోతి, గుమ్మడి జలపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గట్టుబుత్కూర్‌లో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

గంగాధర: మండలంలోని గట్టుబుత్కూర్ గ్రామంలో బుధవారం వికాస్ మహిళా కళాశాల విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా వీధులు శుభ్రం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నిగమ కళాశాల అధినేత బీవీఆర్ గోపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఎస్ఆర్ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మురళీ, రాంరెడ్డి, వికాస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణ, స్వప్న, నాగరాజు పాల్గొన్నారు.

జాడలేని సబ్సిడీ రుణాలు

- నాలుగేళ్లుగా ఎస్సీ కార్పొరేషన్ రుణాల పంపిణీ ఊసేలేదు
- ఆశావహులకు తప్పని ఎదురుచూపు
- తాజాగా గన్నేరువరం మండలానికి 120 పాడి పశువుల యూనిట్లు కేటాయించిన ప్రభుత్వం



కార్పొరేషన్ రుణాల కోసం గన్నేరువరంలో నిర్వహించిన గ్రామసభ(ఫైల్)

గన్నేరువరం: దళితుల సంక్షేమంపై సర్కారు చెప్పేదొకటి.. చేసేదొకటి. ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరుపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. గడిచిన నాలుగేళ్లలో ఆశావహులకు రుణాల పంపిణీ జరగకపోవడంతో ఎదురుచూపులే మిగిలాయి. తాజాగా ఈ ఏడాది సబ్సిడీపై పాడి పశువులను అందించడానికి ప్రభుత్వం 120 యూనిట్లు మండలానికి కేటాయించింది. దీనికి సంబంధించి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. లబ్ధిదారుల ఎంపికకు అధికారులు, బ్యాంకర్లతో కలిసి త్వరలో గ్రామసభలు నిర్వహించనున్నారు. కానీ ఈ ఏడాదైనా రుణాలు అందేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

–ఏటా ఎదురుచూడటమే

2018 సంవత్సరానికి ముందు ఆలస్యంగానైనా రుణాలను అందించిన ప్రభుత్వం ఆ తర్వాత పట్టించుకోవడంలేదు. ఏటా దరఖాస్తులు చేసుకోవడం.. ఆపై ఎదురుచూడటం మామూలైపోయింది. లక్షలోపు రుణాలకు 80 శాతం సబ్సిడీ, లక్ష నుంచి రెండు లక్షల వరకు 70 శాతం, రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు 60 శాతం సబ్సిడీ లభించనుంది. రుణాలతో చిన్నచిన్న వ్యాపారులు చేసుకుంటూ ఇల్లు గడుపుకుందామనుకునే వారికి నిరాశే మిగులుతోంది.

ఇదీ పరిస్థితి..

నాలుగేళ్లకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, తాజాగా మండలానికి సబ్సిడీ యూనిట్లు మంజూరయ్యాయి. గతంలో స్కిల్డ్, అన్‌స్కిల్డ్ పద్ధతిలో ఎంపిక చేసిన అధికారులు సంబంధిత జాబితాను ప్రభుత్వానికి పంపించారు. తాజాగా సబ్సిడీపై పాడిపశువుల యూనిట్లు మంజూరు కావడంతో ఆశావహులు మళ్లీ దరఖాస్తు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికల ఏడాది కావడంతో రుణాలు మంజూరు చేస్తారనే గంపెడాశలతో దరఖాస్తులు చేసుకుంటున్నారు. 120 యూనిట్లు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. ఒక్కో యూనిట్ కింద రూ. రెండు లక్షలు ఎంపికై న లబ్ధిదారుడికి అందజేయనున్నారు. ఇందులో రూ. 1.40 లక్షల వరకు సబ్సిడీ, దరఖాస్తుదారుడికి 20 గుంటలు భూమి ఉండాలి లేదా లీజుకైనా తీసుకుని ఉండాలి. అలాగే దళిత బంధు పథకానికి పీచుపల్లి గ్రామం ఎంపిక కావడంతో పాటు సాంబయ్యపల్లెలో దళిత కుటుంబాలు లేకపోవడంతో మిగిలిన 14 గ్రామపంచాయతీల్లోని అర్హుల నుంచి జీపీ కార్యదర్శులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

సంవత్సరం	యూనిట్లు	దరఖాస్తులు	ఎంపికైనవారు
2015–16	24	25	24
2016–17	27	118	35
2017–18	24	66	37
2018–19	24	284	(ఎంపిక జరగలేదు)
2019–20	(కార్పొరేషన్ యూనిట్లు కేటాయించలేదు)		
2020–21	5	116	(నేటికి మోక్షం లేదు)

ఎంపికైన వారిలో యూనిట్లకు సరిపోయే అర్హులకు రుణాలు మంజూరు చేశారు

నాలుగేళ్లు అవుతోంది



ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకుని నాలుగేళ్లు అవుతోంది. చెప్పుల దుకాణానికి దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటి వరకు రుణం అందలేదు. సంబంధిత అధికారులు, కార్యాలయాలు చుట్టూ తిరిగినా ఫలితం లేదు. ఇప్పటికైన రుణాలు మంజూరు చేయాలి.

– బోయిని స్వప్న, గునుకులకొండాపూర్

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం



ఈఏడాది మండలానికి ఎస్సీ కార్పొరేషన్ కింద 120 పాడిపశువుల యూనిట్లు మంజూరయ్యాయి. దరఖాస్తులు స్వీకరిస్తున్నాం, వారం రోజుల్లో అర్హులను ఎంపిక చేయడానికి గ్రామాల్లో బ్యాంకర్లతో కలిసి గ్రామసభలు నిర్వహిస్తాం. ఎంపికైన వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాం.

– నర్సింహారెడ్డి, ఎంపీడీవో, గన్నేరువరం

కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

సైదాపూర్: హుస్నాబాద్‌లో 20న నిర్వహించే కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం వెన్కెపల్లి ఈర్లబండ వద్ద ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాతనే మండలంలో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతిపక్షాల విమర్శలను పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎందుకు తిప్పికొట్టడంలేదన్నారు. బీఆర్ఎస్ మండల నాయకత్వంపై అసహనం వ్యక్తం చేశారు. నాయకులే అణగదొక్కుతున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులతో కాకుండా నేరుగా మాట్లాడాలని ఎమ్మెల్యే కార్యకర్తలకు హామీ ఇచ్చారు. గ్రామశాఖ అధ్యక్షులు, సర్పంచ్, ఎంపీటీసీల ఆధ్వర్యంలో సభకు అధిక సంఖ్యలో ప్రజలను తరలించాలని సూచించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గోపాల్‌రావు, ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండోల చైర్మన్లు కొత్త తిరుపతిరెడ్డి, బిల్లా వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



జమ్మికుంట: విరాళం అందజేస్తున్న దాతలు



గంగాధర: ఆర్థికసాయం చేస్తున్న జయపాల్‌రెడ్డి

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి దాతలు విరాళం అందజేశారని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన మర్రిపల్లి రాజయ్య రూ.25,051, పర్లపల్లి బొందయ్య రూ.15,016, వీర్ల రాజేశ్ రూ. 10,016 ఇచ్చారని, ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు తిరుపతిరెడ్డి, శ్రీకాంత్, రమేష్, నాగరాజు, సుదర్శన్, రాజు, పోతరాజు కుమారస్వామి, కొమురయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప ఆలయానికి..

గంగాధర: మండలంలోని గట్టుబుత్కూర్ గ్రామంలో నిర్మిస్తున్న బీరప్ప ఆలయానికి మైత్రి గ్రూప్స్ మీడియా అధినేత కొత్త జయపాల్‌రెడ్డి బుధవారం రూ. 50,116 అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం నిర్మాణం చేస్తున్న సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డిని అభినందించారు. అనంతరం గ్రామంలో వికాస్ డిగ్రీ మహిళా కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు గ్రామ సమస్యలపై అవగాహన పెంచుకొని పరిష్కారం దిశగా ఆలోచనలు చేయాలని సూచించారు. శిబిరం నిర్వహణ కోసం రూ. పదివేల ఆర్థికసాయం చేశారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాసారపు బుచ్చిరాములు కుటుంబాన్ని పరామర్శించి రూ. ఐదు వేలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుపుకోవాలి

హుజూరాబాద్: శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని హుజూరాబాద్ ప్రాంత విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రసార ప్రముఖ్ విఠలాచారి కోరారు. బుధవారం పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ..ప్రతి గ్రామంలో మార్చి 22 నుంచి ఏప్రిల్ 6 వరకు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కల్యాణ మహోత్సవాలను జరుపుకోవాలన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్‌రావు, వీహెచ్‌పీ మండల అధ్యక్షులు రమేష్‌రెడ్డి,పట్టణ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం



హుజూరాబాద్: పట్టణంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ పి.అర్పిత ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు ఫిర్యాదులు, సలహాలు, సూచనలను స్వీకరిస్తామని, హుజూరాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలోని వివిధ ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు ఆర్టీసీ సేవలు, ఇతర సమస్యలు 9959225924 నంబర్‌కు తెలియజేయాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నామని తహసీల్దార్ సీహెచ్ కోమల్‌రెడ్డి తెలిపారు. గ్రామాల్లోని ఆయా వాగుల నుంచి ఇసుకను తరలిస్తున్న 11 ట్రాక్టర్లను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించామని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన అడిగొప్పుల హర్షిని వివాహానికి బుధవారం అతిథి బిల్డర్ అధినేత కొమ్మిడి రాకేశ్‌రెడ్డి పుస్తెమెట్టెలు అనుచరుల ద్వారా అందించారు. ఈసందర్భంగా వధూవరులు రాకేశ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాకేశ్‌రెడ్డి యువ సైన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు పోతరవేన సతీశ్, రాజిరెడ్డి, చంద్రమౌళి, తిరుపతి, కొంరయ్య, నరసయ్య, సాగర్, కరుణాకర్, శ్రీను, సమ్మయ్య, అంజయ్య, సత్యనారాయణ, రాజమల్లు తదితరులు ఉన్నారు.

వెదురుగట్టలో...

చొప్పదండి: మండలంలోని వెదురుగట్ట గ్రామానికి చెందిన చిలుక అఖిల వివాహానికి కరీంనగర్‌కు చెందిన కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ బుధవారం పుస్తెమెట్టెలు అందజేశారు. ఆధార్ స్వచ్ఛంద సంస్థ ద్వారా దాత బండారి మారుతి సహకారంతో సమకూర్చారు. కార్యక్రమంలో సాంబయ్య, సంపత్, అశోక్, బడుగు నరేశ్, చిలుక సంజీవ్, చిలుక బాబూరావు, మల్లయ్య, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాంకు నివాళి



చొప్పదండి: నివాళి అర్పిస్తున్న ఏవైఎస్ సభ్యులు

చొప్పదండి: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం కాన్షీరాం జయంతిని అంబేడ్కర్ యువజన సంఘం పట్టణశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సంఘం అధ్యక్షుడు పెద్దెళ్లి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఒక ఓటు ఒక నోటు నినాదంతో రక్తం బొట్టు నేల రాలకుండా బహుజనులను చైతన్యపరిచి మాయావతిని తొలి దళిత సీఎంగా చేసిన ఘనత కాన్షీరాందేనన్నారు. కార్యక్రమంలో రత్నం, కడారి రాజలింగం, వడ్లూరి లచ్చయ్య, అంజయ్య, ఈశ్వర్, కొండయ్య, మహేశ్, శ్రీనివాస్, తిరుపతి, రామారావు, శ్రవణ్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.



చిగురుమామిడి: నవాబుపేటలో....

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కాన్షీరాం జయంతి నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం ముందు కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుద్దాల ప్రవీణ్‌కుమార్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బోయిని సంపత్, ప్రధాన కార్యదర్శి కాశపాక బాబు, సహాయ కార్యదర్శి బోయిని శ్రీనివాస్, నాయకులు శ్యామ్, ఆదిమల్లయ్య, లక్ష్మయ్య, సదయ్య, బాబు, మనోజ్, మల్లేశం, కిష్టయ్య, నాగరాజు, రమేశ్, తదితరులున్నారు.

హుజూరాబాద్: బీఎస్పీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో బహుజనుల అభివృద్ధి కోసం పాటుపడిన కాన్షీరాం సేవలను గుర్తు చేసుకున్నారు. బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు సదానందం, ఇన్చార్జ్ మొగులయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవీందర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను తొలగించాలి

హుజూరాబాద్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికను పదవి నుంచి తొలగించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తిప్పారపు సంపత్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన చైర్మన్లపై అవిశ్వాసం పెట్టిన వెంటనే తొలగించారని, ఇప్పుడు ఓసీ సామాజిక వర్గానికి చెందిన చైర్మన్లను ఎందుకు తొలగించడంలేదో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు 21 మంది చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టి స్వయంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా తొలగించకపోవడంలోని ఆంతర్యం ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ వైపా లేదా కౌన్సిలర్ల వైపా తేల్చుకోవాలన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



ఆస్తిపన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

చొప్పదండి: సకాలంలో ప్రజలు ఆస్తిపన్నులను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. పట్టణంలో ఆస్తిపన్నుల వసూల్‌ను బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఝూన్సీ పాఠశాల యాజమాన్యం రూ. 2.23 లక్షల పన్ను చెల్లించగా యజమానికి రశీదు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెలాఖరులోగా ఆస్తిపన్ను బకాయి చెల్లించాలని లేదంటే 2 శాతం వడ్డీ పడుతుందని, నివాస, వాణిజ్య గృహాలు, రైస్‌మిల్లులు, స్కూల్, కాలేజీలు పన్నుల చెల్లింపులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ డి. ప్రశాంత్ కుమార్, పి. రవీందర్, ఎ. అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో ముగిసిన క్రికెట్ పోటీలు



గెలుపొందిన జట్టు సభ్యులను అభినందిస్తున్న నాయకులు, నాయకులు

జమ్మికుంట: క్రీడలతో ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాల మైదానంలో ఖేలో కరీంనగర్, జీతో కరీంగనర్ పేరిట పార్లమెంట్ పరిధి క్రీడోత్సవాల్లో భాగంగా హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని జమ్మికుంటలో మూడురోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిసాయి. ఫైనల్ మ్యాచ్‌లో వీణవంక ఇల్లందకుంట జట్టుపై 15 పరుగులతో విజయం సాధించింది. యువతలోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఖేలో ఇండియా, జీతో ఇండియా కార్యక్రమం ద్వారా దేశ వ్యాప్తంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం గెలుపొందిన జట్టు సభ్యును అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, సర్పంచ్ గురుకుంట్ల సాంబయ్య, ఎండీ షఫీ, ఆరెల్లి శ్రీనివాస్, తూర్పాటి రాజు, రాజకుమార్ మోడెం రాజు, రావుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

హుజూరాబాద్: నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయటం లేదని, ఉద్యోగుల పదవి విరమణ వయస్సు 61 ఏళ్లకు పెంచి నిరుద్యోగుల నోటిలో మట్టి కొట్టారని ఉద్యోగాల కోసం కష్టపడి చదువుతుంటే పేపర్ లీకేజీలు ఏంటని ప్రశ్నించారు. ఉద్యోగాలు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి బాబు, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఏముల పుష్పలత, సీనియర్ నాయకులు అప్పాల రఘుపతి, నీరటి రవీందర్, పాకాల ప్రభాకర్‌రెడ్డి, ఎం.తిరుపతి తదితరులు ఉన్నారు.

దర్గాలో నాయకుల ప్రార్థనలు

జమ్మికుంట: మహారాష్ట్రలోని అజరత్ తాజుద్దీన్ బాబా దర్గాలో బుధవారం హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ చైర్మన్ ఎండీ సలీం పాషా ఆధ్వర్యంలో నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందాలని, నిరంతరం ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్నాడని, హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కసుబోజుల వెంకన్న, చిన్నింటి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి చర్యలు

చిగురుమామిడి: బీఆర్ఎస్ బలోపేతానికి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ చర్యలు తీసుకుంటున్నారని పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మామిడి అంజయ్య తెలిపారు. బుధవారం చిగురుమామిడిలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. బీఆర్ఎస్ చిగురుమామిడి గ్రామశాఖ నూతన కన్వీనర్‌గా ఆకవరం శివప్రసాద్‌ను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎంపిక చేశామని, కొంత కాలంగా అధ్యక్షుడిగా ఉన్న బుర్ర శ్రీనివాస్‌ను గ్రామశాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించామని చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలశాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంబాబు, చిగురుమామిడి సర్పంచ్ లక్ష్మణ్, ఆయా గ్రామాల బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్‌కె సిరాజ్‌పాషా, నాగెల్లి రాజిరెడ్డి పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. పట్టణంలోని ప్రతాపవాడలో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు.

హుజూరాబాద్‌రూరల్: కంటి వెలుగు శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సిర్సపల్లి గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంటి సమస్యలతో బాధపడుతున్నవారి ఇబ్బందులు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా కంటి వెలుగు పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలను అందజేయటంతో పాటు శస్త్రచికిత్స చేయిస్తామని పేర్కొన్నారు.

ఇల్లందకుంట: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మల్లన్నపల్లి సర్పంచ్ పసునూటి మానస మహేందర్ అన్నారు. గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 126మందికి పరీక్షలు చేయగా 31మంది కంటి సమస్యలతో బాధపడుతున్నారని డాక్టర్లు గుర్తించారని తెలిపారు.

ఫీల్డ్ విజిట్



వీణవంక: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. 'లా అండ్ జస్టిస్ ఏ కేస్ స్టడీ'అనే పాఠ్యాంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పోలీస్‌స్టేషన్‌ను తీసుకెళ్లామని హెచ్ఎం పులి అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయుడు ముల్కల కుమార్ తెలిపారు. ఫిర్యాదు చేయడం, ఎఫ్ఐఆర్, ఇన్వెస్టిగేషన్, సివిల్, క్రిమినల్ కేసులు, సమన్లు జారీ చేయడం, చార్జిషీట్ దాఖలు, బెయిల్ పొందే విధానం తదితర అంశాలను ఎస్సై శేఖర్‌రెడ్డి వివరించారు. ఆపదలో డయల్ 100కి సమాచారం ఇవ్వాలని, బాలికలు, మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయపాల్‌రెడ్డి, శ్రీనివాస్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



పోచమ్మ బోనాలు

మానకొండూర్: మండలంలోని కొండపలకల గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. నెత్తిన బోనంతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో శ్రీహరి, రాములు, వేణు, దశరథం, స్వామి, గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిగౌడ్, మోహన్ పాల్గొన్నారు.